epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:32

24 క్యారెట్లు 153,440.00 | కిలో వెండి 2,50,000.00 | chourastha Digitals | 17.09.2026 గురువారం, హైదరాబాద్

## నేటి నుంచి ఐదు రోజులపాటు వర్షాలు



- ఉరుములు, మెరుపులతో భారీ వర్షా లు
- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ
- హైదరాబాద్ వాతావరణం శాఖ
- వర్షా ల లోటు వల్ల పంట విస్తీర్ణంలో 6.12 శాతం తగ్గుదల

2లో



# ధరణితో కల్వకుంట్ల కుటుంబం దోపిడీ

- రూ. లక్ష కోట్ల విలువైన భూమిని దోచారు
- ఆయన కుటుంబ ఆధీనంలో 440 ఎకరాలు
- విదేశీ ముఠాకు ధరణి పోర్టల్ ఇచ్చారు
- నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- 30 రోజుల్లో అధికారులు నివేదిక ఇవ్వాలి
- సత్యం రామలింగరాజు భూమి కేటీఆర్‌కు ఎలా బదిలీ అయ్యింది?
- రంగనాయక సాగర్‌లో హరీశ్‌రావు ఫామ్‌హౌస్ అక్రమమే
- మైహోం కంపెనీకి 2,300 ఎకరాలు ఎలా ఇచ్చారు?
- 22-Aలో 98,37,320 ఎకరాలు ఉండాల్సిందే
- లేకుంటే వాటికి రక్షణ ఉండదు
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## కేసీఆర్ భూదోపిడీపై విచారణ

ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు రూ. లక్ష కోట్ల భూదోపిడీకి పాల్పడ్డారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ భూములు, వక్ఫ్, దేవాదాయ, ఫారెస్టు, అసైన్డ్, ఇనాం, వివాదాల్లోని భూములు.... ఇలా కల్వకుంట్ల కుటుంబం వేటినీ వదిలిపెట్టలేదన్నారు. బుధవారం శాసనసభలో 22ఏపై జరిగిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. భూ రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలను ఉల్లంఘించి, భూములను కొల్లాగొట్టారని చెప్పారు. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబం 440 ఎకరాల భూమిని ఆక్రమించిందన్నారు. అంత భూమి ఎలా వచ్చిందో కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. చట్టాలను విధ్వంసం చేసి, పేదల భూములను లాక్కున్నారని చెప్పారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

ఈ వ్యవహారంపై ప్రత్యేక విచారణ బృందం(ఎస్‌ఈటీ) ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ బృందం కేసీఆర్ కుటుంబంతో పాటు ధరణి అక్రమాలపై 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భూములపై కోర్టు కేసులు, వివాదాలతో కొంత ఆలస్యమైనా కేసీఆర్ భూదోపిడీని నిగ్గుతేలుస్తామన్నారు.భూ దోపిడీకి పాల్పడిన ఆ కుటుంబం జైలుకుపోక తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ బినామీ బోయినపల్లి శ్రీనివాసరావు వట్టినాగులపల్లిలో ప్రభుత్వ భూమికి సేల్ డీడ్ చేసినట్టు బహిర్గతమైందని చెప్పారు. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి పార్టీ ఫిరాయించినందుకు ఆయన పేరిట 106 ఎకరాల ఫారెస్ట్ భూమిని పట్టాగా మార్చారని తెలిపారు. అటవీ శాఖ అధికారులు కోర్టుకు పోతే ఆ భూమి

।మిగతా 2 లో।

## సీబీఐతో విచారణ జరిపించాలి

- ఎన్నికల అఫిడవిట్‌లో కంటే గజం ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తా
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

2లో

## యూపీఐ ఛార్జీలు ప్రజా వ్యతిరేక నిర్ణయం

2లో




- యూపీఐపై పన్ను విధించడం
- మోదీ ప్రతి భారతీయుడిపై పన్ను భారం
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- యూపీఐ ఛార్జీలపై పార్లమెంటరీ ప్యానెల్ మీట్‌లో ఎంపీల ఆందోళన
- ఈ ప్రజా వ్యతిరేక చర్య వల్ల
- ప్రజలందరూ ప్రభావితం
- ప్రతిపక్ష ఎంపీల ధ్వజం



## రాజధానిలో రౌడీల బెడద

- పోలీసుల హెచ్చరికల్ని బేఖాతర్
- నడిరోడ్లపై హతమారుస్తూ పోలీసులకు సవాల్
- నివురుగప్పిన నిప్పులా పాత పగలు
- పోలీసులు శతవిధాలా ప్రయత్నిస్తున్నా
- వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు
- నేరగాళ్లు మకాంపై నిఘా లేకపోవడమే సమస్య
- 72 మంది రౌడీషీటర్లపై కేసులు నమోదు
- నేరాలు చేస్తే పాత కేసుల్లో బెయిళ్లు రద్దు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

రాజధాని హైదరాబాద్‌లో రోజుకో రౌడీగ్యాంగు హల్‌చల్ చేస్తోంది. పోలీసులు పీడీయాక్టులు ప్రయోగిస్తున్నా, బైండోవర్ చేస్తున్నా వారిని నిలువరించలేకపోతున్నారు. పోలీసులు సామ, దాన, భేద, దండోపాయాలతో కట్టడి చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నా, వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు. వీరంతా బెదిరింపులు, హత్యలు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలతో నగరంలో శాంతి భద్రతలకు సవాల్ విసురుతున్నారు.

**రాజధానిలో భయానక పరిస్థితులు**

వాటాల్లో తేడా వచ్చినా, ఎదిరించి

।మిగతా 5 లో।

అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54 ఎకరాల చొప్పున ఉందని వివరించారు.

## భూములు కబ్జా చేయాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదు

- మేం ఎన్నికల అఫిడవిట్‌లో చూపిన ఆస్తులే అసెంబ్లీలో చెప్పిండు
- అసెంబ్లీ సాక్షిగా రేవంత్ అర్ధసత్యాలు,అబద్ధాలు
- సీఎం కుటుంబానికి 308 ఎకరాల భూమి
- వెల్దండ మండలం కొట్ర గ్రామంలోనే 175 ఎకరాలు
- కాంగ్రెస్ అక్రమాలు బయటపెడతామనే మాపై సస్పెన్షన్
- భూభారతి, 22ఏపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సస్పెండ్
- మేం ప్రశ్నిస్తుంటే రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు
- మాజీమంత్రి హరీశ్‌రావు

2లో



## గణేశ్ నిమజ్జనంలో విషాదం

- నిమజ్జనంలో ఆరుగురు విద్యార్థుల మృత్యువాత
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం ఎ. రేవంత్ రెడ్డి
- రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- సంగారెడ్డి జిల్లాలో విషాద ఛాయలు
- గణేశ్ నిమజ్జనాల సమయంలో జాగ్రత్తలు పాటించాలి

2లో



# భూములు కబ్జా చేయాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాలు భూమి ఉందన్నారు. వెల్దండ మండలం కొత్ర గ్రామంలోనే 175 ఎకరాలు, వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 79 ఎకరాలు, ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఇతర భూమి 54 ఎకరాల చొప్పున ఉందని వివరించారు. రేవంత్‌రెడ్డి కుటుంబ భూముల వివరాలు అన్ని త్వరలో మరిన్ని బయటకి వస్తాయని చెప్పారు. ప్రజల సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే, డైవర్షన్ రాజకీయాలకు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కుట్రపూరితంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసిందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలను బయటపెడతామనే సభలో లేకుండా చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటుకు టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు, తాము టీ షర్టు వేసుకుని అసెంబ్లీకి వస్తే తప్పా? అని ప్రశ్నించారు. పార్లమెంటు, అసెంబ్లీ నియమాలు వేరా? అని అడిగారు.

**సమస్యలపై ప్రశ్నిస్తామనే ఎదురుదాడి**

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తామనే భయంతోనే ప్రభుత్వం తమపై ఎదురుదాడికి దిగుతోందని హరీశ్‌రావు చెప్పారు. 22ఏ నిషేధిత భూముల విషయంలో



బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు అక్షర సత్యమని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో అంగీకరించారని అన్నారు. 3.71 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో పెడితే, అది 30 లక్షల ఎకరాలకు పెరిగిందని ముఖ్యమంత్రే చెప్పారని గుర్తు చేశారు. దీనివల్ల ఎన్ని లక్షల కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కలెక్టర్లు తొందరగా సంతకాలు పెట్టి అప్‌లోడ్ చేశారని సీఎం అంటున్నారనీ, తప్పు చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

**సీఎం, మంత్రి మాటల్లో ఎవరిది నిజం**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క ఎకరా కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని మంత్రి పొంగులేటి అన్నారని హరీశ్‌రావు గుర్తు చేశారు. అధికారులే 30 లక్షల ఎకరాలు అప్‌లోడ్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్తున్నారని వివరించారు. ఆ ఇద్దరిలో ఎవరి మాటలు నిజమని ప్రశ్నించారు. 1999 నాటి పాత జాబితాను కలెక్టర్లు అప్‌లోడ్ చేశారనీ, ప్రభుత్వం అమ్మిన హెచ్ఎండీఏ, యూఎల్‌సీ భూములను కూడా నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిందని ముఖ్యమంత్రే స్వయంగా ఒప్పుకున్నారని వివరించారు. ప్రజలకు క్షమాపణలు చెప్పి సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు రాత్రికి రాత్రి నిషేధిత జాబితా నుంచి ఎలా తొలగించారో, అదే విధంగా ప్రజల ఆస్తులను కూడా 22ఏ నుంచి తొలగించాలని కోరారు. సామాన్యుడికైనా, ముఖ్యమంత్రికైనా చట్టం ఒకటే ఉండాలన్నారు. 22ఏ జాబితాలో సీఎం భూమి పెట్టింది, తీసింది బయటపెట్టాననే తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

**వసూళ్ల కోసమే ఈ నాటకాలు**

నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించడానికి కమిటీలు వేస్తాం, మార్గదర్శకాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నారు తప్ప, స్పష్టమైన పరిష్కారం చూపలేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసేందుకే ఈ నాటకాలు ఆడుతున్నారని అన్నారు. కేసీఆర్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని చెప్పారు. 2023 డిసెంబర్ ఏడు నుంచి ఇప్పటి వరకు ఎన్ని భూములు నిషేధిత జాబితాలో పెట్టారు, ఎన్ని తొలగించారు అనేదానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 22ఏ వ్యవహారంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు.

**భూభారతిలో 9,200 అక్రమ రిజిస్ట్రేషన్లు**

భూభారతిలో 9,200కు పైగా భూముల రిజిస్ట్రేషన్లు యజమానులకు తెలియకుండానే అక్రమంగా జరిగిపోయాయని హరీశ్‌రావు విమర్శించారు. ఇంత పెద్ద కుంభకోణంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడ్డం లేదని ప్రశ్నించారు. ధరణి ద్వారా కొన్ని లక్షల లావాదేవీలు నిమిషాల్లో జరిగాయని గుర్తు చేశారు. చిన్న చిన్న పొరపాట్లు ఉంటే సరిదిద్దాల్సింది పోయి, భూభారతి పేరుతో కుంభకోణాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 11.19 లక్షల మంది రైతులకు ఉచితంగా సాదా బైనామాలు చేశామని గుర్తు చేశారు. 58, 59 జీవోల ద్వారా లక్షల కుటుంబాలకు పట్టాలు ఇచ్చామన్నారు.తాజా వార్తలు చదవండి

**విచారణకు మీరు సిద్ధమా?**

ధరణి లేదా భూభారతిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో జరిగిన వ్యవహారాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు తాము సిద్ధమనీ, సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా?అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. తనకున్న వ్యవసాయ భూమి వివరాలు ఎన్నికల అఫిడవిట్‌లో, ఆదాయపు పన్నులో స్పష్టంగా ఉన్నాయనీ, ఒక్క గుంట కూడా అదనంగా లేదని స్పష్టం చేశారు. తన భూమిని సర్వే చేసిన అధికారులే రెండు గుంటలు తక్కువ ఉందని తేల్చారని గుర్తు చేశారు. తమ బంధువులు చట్టబద్ధంగా కంపెనీ షేర్లు కొనుగోలు చేస్తే దానిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారనీ, ప్రతి రూపాయి వైట్ మనీయేనని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో, ఇప్పుడు మూడేండ్ల కాంగ్రెస్ పాలనలో సంపాదించిన ఆస్తులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# నేటి నుంచి ఐదు రోజులపాటు వర్షాలు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

తెలంగాణలో రేపటి నుంచి ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర తెలంగాణలోని జిల్లాలలో ముఖ్యంగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. 19, 20, 21 తేదీల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు వాతావరణశాఖ చెప్పింది. సంబంధిత జిల్లాలకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది. కర్ణాటక నుంచి నైరుతి బంగాళాఖాతం వరకు ద్రోణి ఏర్పడింది. తమిళనాడు మీదుగా 4 మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి విస్తరించిందని ఐఎండీ స్పష్టం చేసింది.వర్షాల లోటుతో 6.12 శాతం తగ్గిన పంట విస్తీర్ణం రాష్ట్రంలో సుమారు పక్షం రోజుల తర్వాత మూడు రోజులు వానలు కురిశాయి. అయినా 18 జిల్లాల్లో వర్షాభావమే నెలకొంది. 621కి గాను 323 మండలాల్లోనూ ఇప్పటికీ తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాల లోటు వల్ల పంట విస్తీర్ణంలో 6.12 శాతం తగ్గింది. రాష్ట్రంలో ప్రధాన పంట వరి 10.58 లక్షల ఎకరాల మేర తక్కువగా సాగైంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై బుధవారం శాసనసభలో స్వల్పకాలిక చర్చలు జరగనున్నాయి. ఇప్పటికే ఎల్‌నినో పరిస్థితులపై వ్యవసాయశాఖ నివేదికను సిద్ధం చేసింది. దీనిని ప్రభుత్వానికి సమర్పించింది. రాష్ట్రంలో వానాకాలం సీజన్ దాదాపుగా ముగిసింది. మిర్చి మినహా ఇతర ఏ పంటలను వేయడం లేదు. ఈ తరుణంలో పంటలకు భారీ వర్షాలు అవసరమని రైతులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.



**రాష్ట్రంలో నమోదైన లోటు వర్షపాతం ఇలా**

జూన్‌లో 11.74 శాతం, జులైలో 1.36 శాతం, ఆగస్టులో 37.67 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ఈ నేపథ్యంలోనే ఈ నెలలో ఇప్పటివరకు 29.39 శాతం తక్కువగా నమోదైంది. సీజన్ మొత్తంలో లోటు 18.82 శాతంగా ఉంది. రాష్ట్రంలోని జోగులాంబ జిల్లాలో అత్యధికంగా 45.42 శాతం లోటు నమోదవగా, తర్వాత స్థానంలో హనుమకొండ 41.91 శాతం, వనపర్తి 40.70 శాతం, నాగర్‌కర్నూల్ 38.67 శాతం, నారాయణపేట జిల్లాలో 37.42 శాతం లోటు నమోదైంది.

**తగ్గిన పంట విస్తీర్ణం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ప్రధానంగా ఆదిలాబాద్, భువనగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, యాదాద్రి, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి, మేడ్చల్, నల్గొండ, సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాలదీ ఇదే పరిస్థితి. ప్రస్తుత సీజన్‌లో పంట విస్తీర్ణం 1,32,38,446 ఎకరాల లక్ష్యానికి గాను 1,24,27,818 ఎకరాల (93.88 శాతం) మేర సాగైంది. వరి 65,95,645 ఎకరాలకు గాను 55,36,885 ఎకరాల్లో వేశారు.

# యూపీఐ ఛార్జీలు ప్రజా వ్యతిరేక నిర్ణయం

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**

యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేటు విధించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బుధవారం ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రజా వ్యతిరేక చర్య వల్ల దేశ ప్రజలందరూ ప్రభావితమవుతారని దుయ్యబట్టారు. ఈ మేరకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలోనూ ఈ అంశాన్ని లేవనెత్తారు. దీంతో పాటు 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 7.8 శాతంగా నమోదైన జీడీపీ (GDP) వృద్ధి రేటును లెక్కించడానికి అనుసరించిన విధానంపై కూడా కొందరు ప్రతిపక్ష ఎంపీలు సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు.అయితే, ఈ అంశాన్ని కొందరు ఎంపీలు సమావేశంలో లేవనెత్తారని, దీనిని కమిటీ తదుపరి మీటింగ్‌లో చర్చించవచ్చని పార్లమెంటరీ ఆర్థిక వ్యవహారాల స్థాయీ సంఘం చైర్మన్ భర్తృహరి మహతాబ్ తెలిపారు. బుధవారం నాటి సమావేశం అజెండాలో UPI అంశం భాగం కాదని మహతాబ్ చెప్పారు. ప్రస్తుత కమిటీ పదవీ కాలం అక్టోబర్ నెలతో ముగియనున్నందున కొత్త కమిటీ దీనిని పరిశీలిస్తుందని అభిప్రాయపడ్డారు. వర్చువల్ డిజిటల్ అసెట్స్ అంశంపై కూడా కమిటీ చర్చించిందని, త్వరలో పార్లమెంటుకు తన నివేదికను సమర్పించే అవకాశం ఉందని మహతాబ్ తెలిపారు.వ్యాపారులకు చేసే రూ. 2,000 దాటిన చెల్లింపులపై రుసుము విధించే ప్రభుత్వ నిర్ణయం వల్ల దేశ ప్రజలందరూ ప్రభావితమవుతారని కమిటీ సభ్యుడు RSP ఎంపీ ఎన్. కె. ప్రేమచంద్రన్ అన్నారు. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక నిర్ణయం అని ప్రేమచంద్రన్ చెప్పారు. రోజూ లక్షలాది లావాదేవీలు జరుగుతుంటాయని, రుసుము విధించే నిర్ణయం ఏకపక్షంగా తీసుకున్నారని అన్నారు. పార్లమెంటరీ కమిటీ కార్యకలాపాలు గోప్యమైనవని, వాటిపై వ్యాఖ్యానించడం సముచితం కాదని కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ అన్నారు. "అయితే UPI, దానిపై విధించబోయే లావాదేవీ రుసుములపై దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాబట్టి సహజంగానే దేశ ప్రజలను కలవరపెట్టే అంశాలు పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లోనూ చర్చకు వస్తాయి." అని ఆయన అన్నారు.ఈ క్రమంలోనే ప్రభుత్వం GDPని లెక్కించే విధానాన్ని వివరించాలని డిమాండ్ చేశారు. "ప్రభుత్వం ప్రామాణిక సంవత్సరాన్ని మార్చారు. ఆధార సంవత్సరాన్ని మార్చినప్పుడు, ఏ సూచికలను తొలగించారు? ఏ కొత్త అంశాలను చేర్చారు? మొదటి త్రైమాసికానికి సంబంధించిన సరైన GDP అంచనా ఏమిటనే దానిపై చాలా ఆందోళనలు ఉన్నాయి కాబట్టి GDPని లెక్కించే విధానాన్ని ప్రభుత్వం తప్పక వివరించాలి." అని ఆయన పేర్కొన్నారు. ఆగస్టు 31న విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్ జూన్ కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు 6.9 శాతంగా ఉంది. అయితే, GDP రేటును లెక్కించడానికి అనుసరించిన విధానంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.యూపీఐపై పన్ను విధించడం ద్వారా మోదీ ప్రతి భారతీయుడిపై పన్ను భారం : రాహుల్ గాంధీ ఇదిలా ఉండగా, యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధానాన్ని ఖరారు చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో దుయ్యబట్టాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు సాష్టాంగ పడాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయించుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. యూపీఐ చెల్లింపులపై రుసుము విధించాలనే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన ఎక్స్‌లో డిమాండ్ చేశారు. యూపీఐపై పన్ను విధించడం ద్వారా మోదీ ప్రతి భారతీయుడిపై పన్ను భారం మోపారని మండిపడ్డారు.

# సీబీఐతో విచారణ జరిపించాలి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న మొత్తం కంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత మరోసారి స్పష్టం చేశారు. అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి తనకుటుంబానికి ఎక్కడో భూములున్నట్లు అబద్ధాలు చెప్పారని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. అసలు ఈ ముఖ్యమంత్రిపైనే తమకు నమ్మకం లేదన్నారు. అసెంబ్లీలో సీఎం చదివిన భూముల చిట్టాలో నిజాలు నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన వ్యక్తి కేసీఆర్ ఫాం హౌస్‌లో ఉండే సీఎం గూఢచారి సహా నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు భూములపై సమగ్ర విచారణ చేయాలన్నారు. ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి భూములపై సీబీఐతో విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని కవిత డిమాండ్ చేశారు.

# ఆస్తుల వివరాలు బయటపెట్టాలి

- బీఆర్ఎస్ అక్రమాలు బయటపెట్టేందుకు సీఎంకు మూడేళ్లు పట్టింది
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

బీఆర్ఎస్ అక్రమాలు బయటపెట్టేందుకు సీఎంకు మూడేళ్లు పట్టిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలతో సెటిల్మెంట్ కుదరనందుకు ఇప్పుడు బయటపెడుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు అఫిడవిట్‌లో చెప్పిన ఆస్తుల వివరాలు వెల్లడించాలని, అలాగే వారికి ఇప్పుడున్న ఆస్తుల వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అన్ని ఎంక్వయిరీ కమిషన్లు వేయటం తప్ప ఈ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది ఏమీ లేదని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.





# గణేశ్ నిమజ్జనంలో విషాదం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

సంగారెడ్డి జిల్లాలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. పటాన్‌చెరు ఠాణా పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. గ్రామంలోని గణేశ్ విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడి మృతి చెందారు. చెరువులోంచి ఆరుగురు విద్యార్థులను స్థానికులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కాగా మృతులను శిరీష ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా గుర్తించినట్లుగా సమాచారం.

**ఘటనపై గవర్నర్, సీఎం దిగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతిచెందిన ఘటనపై రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గణేశ్ నిమజ్జనాల సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని గవర్నర్ సూచించారు. మృతుల కుటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేసింది.నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థుల మృతిచెందిన ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. చిన్నారులను కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని మంత్రి పొన్నం తెలియజేశారు. నిమజ్జనాల ప్రాంతాల్లో అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.

# ధరణితో కల్వకుంట్ల కుటుంబం దోపిడీ

**తరువాయి భాగం**

ప్రయివేటు భూమి అంటూ కలెక్టర్ నివేదించారంటే, కేసీఆర్ కుటుంబం ఏ రకంగా భూ విధ్వంసానికి పాల్పడిందో అర్థమవుతోందన్నారు. బహదూర్‌గూడలో 77 ఎకరాల భూములు ఎలా అన్యాక్రాంతమయ్యాయో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి లేఖ రాయాలని సూచించారు. ఓ పత్రిక ఎమ్‌డీకి బెంజ్ కార్లు ఎలా వచ్చాయో, అందుకు ప్రతిఫలంగా గోల్డ్ స్టోన్ ప్రసాద్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మేలు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

**ధరణి అడ్డం పెట్టుకుని... భూదాన్ భూముల పట్టా**

ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని భూదాన్ భూములకు ఇబ్బడి ముబ్బడిగా పట్టాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. సిరిసిల్లలో ఎనిమిదివేల ఎకరాల అసైన్డ్ భూములు బదలాయించారని తెలిపారు. సందీప్ ఝాను కలెక్టర్‌గా వేస్తే రెండువేల ఎకరాలను బయటకు తీశారని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల మైహోం రామేశ్వర రావుకు 2,647 ఎకరాల భూమి కట్టబెట్టారన్నారు. ప్రజల సొమ్మును ఇష్టం వచ్చినట్టు కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేళ్ల చెరువులో ధరణి ద్వారా భూదాన భూమికి పట్టా ఇచ్చారని ఆధారాలను బహిర్గతం చేశారు.

మైహోం కంపెనీకి 113 ఎకరాలు సిమెంట్ ఫ్యాక్టరీకి వాడుకుంటున్నారని తెలిపారు. అసైన్డ్ భూములు... వక్ఫ్ భూములన్నీ మై హోమ్ వాళ్ళు లాక్కోవచ్చా? అని నిలదీశారు. భూములు ఎక్కడ కనిపించినా గద్దల లెక్క వాలిపోయారని విమర్శించారు. ఈ చర్చ రాకుండా ఉండాలనే సభలో గందరగోళం చేయాలని చూశారని తెలిపారు. ఆడబిడ్డలను అడ్డంపెట్టుకుని అడ్డుకోవాలి అనుకున్నారని చెప్పారు. శిశుపాలునికి కూడా వంద తప్పులు చేస్తేనే శిక్ష పడిందని గుర్తు చేశారు. ఏ రాక్షసుడికైనా సమయం వస్తుంది... అప్పుడే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. 22A ను అడ్డంపెట్టుకుని తమపై నిందలు వేయాలని చూశారని తెలిపారు. సంగారెడ్డి లో భూముల చిట్టా కూడా బయట పెడతానన్నారు. ఇలాంటి వాళ్లను మనం క్షమిస్తే.. మనల్ని భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు.కేసీఆర్ కుటుంబం కొల్లగొట్టిన భూముల వివరాలు

తెలంగాణాలో భూముల అంశానికి సంబంధించి 22Aపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరిన సంగతి తెలిసిందే. చరిత్రలో ఉద్యమాలు చేసినోళ్లు సర్వం కోల్పోయారని.. తెలంగాణ ఉద్యమకారుడు మాత్రం వేలకోట్లు సంపాదించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబం చెరపట్టిన భూముల వివరాలను అసెంబ్లీ వేదికగా ప్రకటించారు.

**కేసీఆర్ భార్య శోభ పేరిట సిద్ధిపేటలో 67 ఎకరాలు భూమి**

కేటీఆర్ పేరుతో 49 ఎకరాలు

ఆయన భార్య శైలజ పేరుతో 17.50 ఎకరాలు

కుమార్తె అలేఖ్య పేరుపై 9.3 ఎకరాలు

కుమారుడు హిమాన్ష్ పేరుపై 46.23

తన్నీరు హరీశ్ రావు 21, అతని భార్య పేరుపై 8.50 ఎకరాలు

కల్వకుంట్ల కవితకు మహబూబ్ నగర్ లో 14 ఎకరాలు

కవిత భర్త అనిల్‌కు 23 ఎకరాలు

**జోగినిపల్లి సంతోష్ రావు తండ్రి పేరుపై 53.16 ఎకరాలు**

సంతోష్‌రావు పేరుతో 18.21 ఎకరాలు

సంతోష్‌రావు భార్య పేరుతో 7.23 ఎకరాలు

మాజీ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ 52 ఎకరాలు, కొండల్ రావు 48 ఎకరాలు

మొత్తంగా తొమ్మిది జిల్లాల్లో. 24 మండలాల్లో, 31 గ్రామాల్లో 440 ఎకరాల భూమి కేసీఆర్ కుటుంబం పేరిట ఉన్నది. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్‌కు 2018 ఎన్నికలకు ముందు రూ.50 కోట్ల విలువైన భూమిని.. రూ.1.53 కోట్లకే క్రమబద్ధీకరించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకరావు, బీఆర్ ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేశారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రాంతంలో 50 ఎకరాల ఫామ్‌హౌస్‌ను నిర్మిస్తే, అందులో 11.05 ఎకరాల ఇనామ్ భూమి ఉంది. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్‌మెంట్ భూమిలో ఫామ్‌హౌస్‌ను నిర్మించారు. ప్రపంచ పటాలు పరిశీలించండి

**భూసమస్యల పరిష్కారానికి 12 సూత్రాలు**

పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (యూఎల్‌సీ) పరిధిలోని మిగులు భూముల క్రమబద్ధీకరణ ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొస్తుంది. పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులను ఈ పథకం ద్వారా పరిష్కరిస్తారు. భూముల రిజిస్ట్రేషన్ క్రమబద్ధీకరణ, రెండు సమాంతరంగా ఏకకాలంలో నిర్వహిస్తుంది.

అధీకృత లేఅవుట్లలోని ప్రభుత్వ భూముల సమస్యలపై వారం రోజుల్లోగా ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసి, వాటిని పరిష్కరిస్తారు. ఇలాంటి ఆస్తుల క్రమబద్ధీకరణ త్వరగా పూర్తి చేసేందుకు నూతన పథకాన్ని ప్రభుత్వం తీసుకొస్తుంది.

సింగరేణి బొగ్గు గని ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరించేందుకు ఆయా జిల్లాల్లో జిల్లాస్థాయి కమిటీలను నియమిస్తారు. జీవో నెంబర్ 59 సమస్యలకు సంబంధించి హక్కు బదిలీ పత్రాలు జారీ చేసిన 1,22,280 దరఖాస్తులను తుది పరిశీలన జరిపి, పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం వేయనుంది. మిగిలిన 18,590 పెండింగ్ దరఖాస్తులను నూతన క్రమబద్ధీకరణ విధానం ద్వారా క్లియర్ చేస్తారు. జీవో నెంబర్ 118తో ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, వాటిని వెంటనే 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఇండ్ల సమస్యపై సమగ్ర న్యాయ సమీక్ష జరిపి, నిర్ణయం తీసుకుంటారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లకు యాజమాన్య హక్కుల విషయంలో విస్తృత సంప్రదింపుల తర్వాత నిర్ణయం తీసుకుంటారు. లబ్ధిదారుని సొంత స్థలంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లకు యాజమాన్య హక్కుల విషయంలో ఐదేండ్లు గడువు విధించి, తర్వాత క్రయవిక్రయాలకు అనుమతి ఇస్తారు. నాలా రుసుం చెల్లించని ప్రయివేటు పట్టా భూముల విషయంలో నాలా చార్జీలు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతి ఇస్తారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అనధికార లేఅవుట్లను నూతన క్రమబద్ధీకరణ పథకంలోకి తీసుకొస్తారు. సికింద్రాబాద్ పరిధిలోని లీజు హోల్డ్ ఆస్తుల ఫ్రీహోల్డ్ క్రమబద్ధీకరణ విషయంలో 30 రోజుల నిర్దిష్ట వ్యవధిలోగా అధికారుల కమిటీని ప్రభుత్వం నియమిస్తుంది. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులకు కేటాయించిన అసైన్డ్ భూములు, భూదాన్ భూములను సమగ్ర ల్యాండ్ పూలింగ్ విధానం పరిధిలోకి తీసుకొస్తారు. దీని ద్వారా సేకరించిన నిధులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేదల గృహనిర్మాణానికి వినియోగిస్తారు.

**22Aలో చేర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు**

22A భూ వివాదానికి సంబంధించి సబ్ కలెక్టర్, ఆర్డీవో మాత్రమే విచారణ ప్రారంభిస్తారు. గ్రామాలు అయితే భూ సర్వే నెంబర్, సబ్ డివిజన్, విస్తీర్ణం, పట్టాదారు, యజమాని వివరాలను గుర్తిస్తారు. పట్టణ ప్రాంతాల్లో అయితే వార్డు, బ్లాక్, ప్లాట్, డోర్ నెంబర్ వివరాలు నమోదు చేస్తారు. రెవెన్యూ, ఎండోమెంట్, వక్ఫ్ ఇలాంటి సంబంధిత రికార్డుల వివరాలు సేకరించి, వాటిని పరిశీలిస్తారు. ప్రస్తుతం భూమి స్థితి ఏంటీ అనే విషయంపై నిర్ధారణకు వస్తారు. మొత్తం భూమిలో కొంత భాగం మాత్రమే నిషేధిత భూమి అయితే.. ఆ భాగాన్ని మాత్రమే 22Aలో చేర్చుతారు. మిగతా భూమిని 22A నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. సదరు భూ యజమానికి ముందుగా ఈకేవైసీ ద్వారా నోటీసులు ఇస్తారు. అందుబాటులో లేకపోతే ఈ మెయిల్ లేదా ఆధార్ కు అనుసంధానమైన చిరునామాకు రిజిస్టర్ పోస్ట్ చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అవసరం అయితే స్థానిక పత్రికల్లో ప్రకటన ఇస్తారు. 15 రోజుల సమయం ఇస్తారు. ఈ సమయంలో సంబంధిత వ్యక్తి తన భూమిని నిషేధిత జాబితాలో పెట్టకుండా కాపాడుకోవచ్చు. సబ్ కలెక్టర్, ఆర్డీవో చేసే విచారణ ప్రక్రియ మొత్తాన్ని, సంబంధిత డాక్యుమెంట్లను ఆడియో కాపీతో సహా ఆర్డర్ కాపీని సంబంధిత వ్యక్తికి అందజేస్తారు. 22A జాబితాకు సంబంధించి వ్యవసాయ భూమి విస్తీర్ణం ఒక ఎకరానికి మించి ఉన్నా, వ్యవసాయేతర భూమి అయితే వెయ్యి గజాలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తుంది. ఈ విచారణ ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాతనే.. ఆ భూమిని 22A నిషేధిత జాబితాలో చేర్చటం జరుగుతుంది. ప్రభుత్వ ఉత్తర్వుల తర్వాతనే భూమికి సంబంధించిన వివరాలను ఐజీఆర్ఎస్ రికార్డుల్లో ఎక్కించటం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ డేటా బేస్ లో ఆన్ లైన్ లో చేర్చుతారు. 22A నిషేధిత జాబితాలోకి ఎక్కడ కూడా మ్యాన్యువల్ గా చేర్చటం జరగదు. పూర్తి పారదర్శకంగానే సాగుతుంది.



# నాగోల్ రౌడీషీటర్ హత్య కేసులో 24 గంటల్లోనే నిందితుల ఆటకట్టించిన పోలీసులు

- 8 మంది అరెస్ట్
- మరో నలుగురు నిందితులు పరారీలో
- పాత పగలు, బెదిరింపులే కారణం

**ఎల్ బి నగర్,తెలంగాణ చౌరస్తా:**

నాగోల్‌లోని ఆనంద్ నగర్ చౌరస్తా వద్ద ఉన్న సుప్రీం వైన్స్ వద్ద కలకలం రేపిన రౌడీషీటర్ మహమ్మద్ నయీమ్ దారుణ హత్య కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఈ హత్యతో సంబంధం ఉన్న 8 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేయగా.. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి తెలిపారు. బుధవారం ఎల్బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీపీ ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు.సీపీ సుమతి ఆదేశాల మేరకు ఎల్బీనగర్ డిసిపి బి. అనురాధ, ఏసీపీ పర్యవేక్షణలో ఎస్ఓటీ నాగోల్ పోలీసులు సంయుక్తంగా రౌండప్ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

**పాత పగలు, బెదిరింపులే కారణం:**

వ్యక్తిగత కక్షలు, ప్రాణభయంతోనే ఈ హత్య జరిగినట్లు దర్యాప్తులో తేలింది. నిందితులైన కనకం ఉమామహేశ్వర్, సయ్యద్ రబ్బాని, కోట్ల దినకర్ మృతుడు నయీమ్ చిన్ననాటి స్నేహితులు. కొంతకాలంగా వీరి మధ్య తీవ్ర విభేదాలు రావడంతో నయీమ్ తమను తరచూ బెదిరిస్తూ, దూషిస్తున్నాడని నిందితులు తెలిపారు.ఈ క్రమంలోనే నయీమ్‌ను హతమార్చేందుకు పథకం పన్నినట్లు తేలింది.జైలులో సయ్యద్ రబ్బానికి పరిచయమైన రాసుమల్ల సాకేత్ ద్వారా మరికొందరిని సమీకరించి హత్యకు కుట్ర రచించారు. హత్యకు ఒక్కరోజు ముందు నిందితులు ఎల్బీనగర్ నుంచి ఖమ్మం




వెళ్లి అక్కడ ఒక హోటల్‌లో విడిది చేసి పథకంపై చర్చించారు. అనంతరం హైదరాబాద్ చేరుకుని నయీమ్ కదలికలపై నిఘా ఉంచి, వైన్స్ వద్ద దాడి చేసి దారుణంగా నరికి చంపారు.

**నిందితుల వివరాలు - స్వాధీనం చేసుకున్న వస్తువులు:**

అరెస్ట్ అయిన వారిలో సయ్యద్ రబ్బాని, కోట్ల దినకర్, రాసుమల్ల సాకేత్, పోలి పుల్ల మహేష్, ఆలకుంట వెంకట్, కోడిగంటి రాఘవేందర్ అలియాస్ రఘు, నల్లపు దాసు, చరణ్ గౌడ్, మహమ్మద్ బద్రుల్లా హుస్సేన్ ఉన్నారు. పరారీలో ఉన్న మిగతా నలుగురు నిందితుల కోసం గాలింపు చర్యలు వేగవంతం చేశారు. నిందితుల నుంచి వేట కొడవళ్లు, ఇనుప రాడ్లు, ఒక టయోటా వాహనం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.మృతుడు నయీమ్‌పై ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉనట్లు, అలాగే వివిధ పోలీసు స్టేషన్లలో పలు క్రిమినల్ కేసులు నమోదయినట్లు పోలీసులు తెలిపారు.కేసును అత్యంత వేగంగా ఛేదించిన ఎల్బీనగర్ డీసీపీ బి.అనురాధ, ఎస్ఓటీ బృందం నాగోల్ ఇన్ స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ సిబ్బందిని సీపీ సుమతి ప్రత్యేకంగా అభినందించారు.

# భూసర్వే ప్రక్రియ ప్రారంభం

**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా :**

తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు రామన్నపేట మండలంలో భూ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని తొలి విడతలో నిదానపల్లి, బాసుప్పల, సూరారం, తుర్కపల్లి గ్రామాలను భూ సర్వేకు ఎంపిక చేసినట్లు తహసీల్దార్ లాల్ బహదూర్ తెలిపారు.భూ సర్వేలో భాగంగా మంగళవారం నిదానపల్లి గ్రామంలో భూముల హద్దుల నిర్ధారణ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. సర్వే సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి భూముల హద్దులను పరిశీలించి, సంబంధిత వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రైతులు సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ శోభ, సర్వేయర్ సోనీ, జీపీఓ లక్ష్మి, నిదానపల్లి సర్పంచ్ నారపాక మాధవి-యాదయ్య, బోగారం సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్, ఆయా గ్రామాలకు చెందిన రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు



# 'హమారా ప్రసాద్'ను తక్షణమే అరెస్ట్ చేయాలి

- అంబేద్కర్‌పై విషప్రచారాన్ని సహించేది లేదు
- తెరవెనుక ఉన్న సూత్రధారులను బయటపెట్టాలి

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

కొత్తగూడెంలో ఐక్యంగా ధ్వజమెత్తిన బహుజన నాయకులుఫిర్యాదు స్వీకరించిన జిల్లా ఎస్పీ సమాజంలో కుల, మత విద్వేషాలు రగిలిస్తూ, రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై సోషల్ మీడియా వేదికగా విషప్రచారం చేస్తున్న 'హమారా ప్రసాద్' (హైందవ ప్రసాద్)ను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బహుజన నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ దళిత, బీసీ, బహుజన సంఘాల ప్రతినిధులు ఐక్యంగా మాట్లాడారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై 'కల్పిత నాయకుడు' పేరుతో సృష్టించిన విషపూరిత పుస్తకాన్ని ఈ నెల 18న విడుదల చేస్తానంటూ హమారా ప్రసాద్ ప్రచారం చేసుకోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. అతడిని కేవలం ఒక పావుగా వాడుకుంటూ సామాజిక ప్రశాంతతను దెబ్బతీయడానికి కొందరు కుట్రదారులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

**జేబీ బాల శౌరి (దళిత సంఘం సీనియర్ నాయకులు):**

అంబేద్కర్‌ను అవమానించడం అంటే ఈ దేశ రాజ్యాంగాన్ని, బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. హమారా ప్రసాద్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరో ప్రభుత్వం వెంటనే తేల్చాలి."

**మారపాక రమేష్ (ప్రముఖ న్యాయవాది):**

"ఇలాంటి విద్రోహ చర్యలను పాలకులు ఆరంభంలోనే పసిగట్టి అణచివేయాలి. సమాజానికి విఘాతం కలిగించే చర్యలపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు."

**మల్లెల రామనాథం (బీసీ సంఘం రాష్ట్ర నాయకులు):**

"పీడితుల, బహుజనుల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయునిపై బురదజల్లడం అజ్ఞానానికి పరాకాష్ట."

**కురిమెళ్ళ శంకర్ (బీసీ సంఘం జిల్లా నాయకులు):**

"గతంలో అంబేద్కర్ వాదాన్ని, రాజ్యాంగాన్ని వీర్యం చేయాలని చూసిన వారంతా కాలగర్భంలో కలిసిపోయారు. ఈ కుట్రలను బహుజనులు తిప్పికొడతారు."

మోదుగు జోగారావు (మాదిగ జేఏసీ నాయకులు): "ఇంత బహిరంగంగా విద్వేష ప్రచారం జరుగుతున్నా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు మౌనం వహించడం శోచనీయం. తక్షణమే చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక సెగను ఎదుర్కోక తప్పదు."

**ఎస్పీకి రాతపూర్వక ఫిర్యాదు**


పత్రికా సమావేశం ముగిసిన అనంతరం నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీని కలసి 'హమారా ప్రసాద్'పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పుస్తకాన్ని నిషేధించాలని కోరుతూ రాతపూర్వక ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక జిల్లా నాయకులు వేల్పుల భాస్కర్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు, మాదిగ యువజన నాయకులు గద్దం రాజశేఖర్, బీసీ సంఘం రాష్ట్ర యువజన నాయకులు మెట్టెల సైదుబాబు, అంబేద్కర్ యువజన నాయకులు నరాల రాజేష్, గుండేటి వెంకట రాములు, మురిపిటి రాములు, మురిపిటి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# షాబాద్‌లో బడా గణేష్‌కు ప్రత్యేక పూజలు

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు

**షాబాద్,తెలంగాణ చౌరస్తా:**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని షాబాద్‌లోని బడా గణేష్ వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు కలిసి గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాథుడిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. దీంతో బడా



గణేష్ ప్రాంగణం భక్తులతో సందడిగా మారగా, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వినాయక నవరాత్రి ఉత్సవాలను 11 రోజుల పాటు విజయవంతంగా నిర్వహించేందుకు యువజన సంఘం సభ్యులు ప్రత్యేకంగా కృషి చేశారు.ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తూ, పూజా కార్యక్రమాలను సమన్వయం చేయడంలో యువజన సంఘం సభ్యులు కీలక పాత్ర పోషించారు. గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని సభ్యులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కమ్మరి శ్రీను, మధు గౌడ్, కృష్ణ, మల్లేశ్ యాదవ్, రామకృష్ణ యాదవ్, మహేందర్ గౌడ్, ధర్పల్లి రవీందర్ గౌడ్, కర్ణాకర్ చారి, నవీన్, రవి, బాలరాజ్, మంగలి రవి తదితరులు పాల్గొన్నారు.



# హరేకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు శ్రీకారం
- సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్,ఎంఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు అల్పాహారం (టిఫిన్) పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యాన్ని పెంపొందించాలనే ఉన్నతమైన లక్ష్యంతో హరే కృష్ణ ఫౌండేషన్ ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ సేవలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ మహమ్మద్ రఫిక్ సోహెల్, పంచాయతీ కార్యదర్శి రాము, వార్డు సభ్యులు మల్లారపు మానస, పచ్చునూరి రాజ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- డీసీకి సీఐటీయూ వినతి
- సానుకూలంగా స్పందించిన డిసి సంపత్ కుమార్

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**

పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మికులకు రావలసిన పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా నాయకులు ఎర్పుల నర్సింహ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.అధికారుల నిర్లక్ష్యం వల్ల మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు కార్మికుల జీతాల నుంచి కట్ చేసిన పీఎఫ్, ఈఎస్ఐ నిధులను సంబంధిత ఖాతాల్లో జమ చేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు.గతంలో పనిచేసిన అధికారులు కార్మికులకు రావాల్సిన కనీస సౌకర్యాలైన బట్టలు,చెప్పులు, సబ్బులు, రెయిన్ కోట్లు అందించకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.వర్కర్లకు రావాల్సిన అన్ని సౌకర్యాలను తక్షణమే పునరుద్ధరించాలని డీసీని కోరారు.దీనిపై డిప్యూటీ కమిషనర్ స్పందిస్తూ... నాగోల్ సర్కిల్‌లోని దాదాపు 400 మంది కార్మికులకు సమాన న్యాయం చేస్తామని.. గతంలో లాగా కాకుండా సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుండె శివకుమార్, వర్కాల బాలరాజ్, కార్మికులు మైసయ్య, జంగయ్య, లింగస్వామి, జగన్, మైపాల్, నరేష్‌లతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా కార్మికులు పాల్గొన్నారు.




# కిషోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

- ఏసిడిపిఓ విజయలక్ష్మి

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని ఏసిడిపిఓ విజయలక్ష్మి అన్నారు. పోషణ మాసం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బుధవారం తొర్రూరు డివిజన్ పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.రక్తహీనత, పోషకాహారం,బాలికల భద్రత, ఐసిడిఎస్ సేవలపై నెల్లికుదురు సెక్టార్ సూపర్వైజర్ నార్లపురం సరిత అవగాహన కల్పించారు.ఏసిడిపిఓ మాట్లాడుతూ...రక్తహీనత రాకుండా కిషోర బాలికలు ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలని తెలిపారు. పోషకాలతో కూడిన ఆహారం,పరిశుభ్రత,ఆరోగ్యకర జీవనశైలి పెంపొందించుకోవాలని కోరారు. రోజువారి మెనూలో గుడ్లు,ఆకుకూరలు,పాలు, చిరుధాన్యాలు,పండ్లు భాగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, అంగన్వాడి టీచర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

- మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో విద్యార్థులకు పోషకాహారం
- హరే కృష్ణ ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకారం

**కమాన్ పూర్,తెలంగాణ చౌరస్తా:**



తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో భాగంగా కమాన్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పోషకాహార అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ శీలారపు మల్లయ్య విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. మల్లిఖార్జున్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి, విద్యలో మెరుగైన ప్రతిభ కనబరచడానికి ప్రతిరోజూ పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంక్షేమం కోసం ఈ అల్పాహార కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీలారపు మల్లయ్య, హెచ్ఎం జి. మల్లిఖార్జున్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# వీరోచిత ప్రజా పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య

**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా:**

నిజాం నిరంకుశ పాలన, దొరలు-భూస్వాముల దోపిడీ, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన మహత్తర సాయుధ పోరాటాన్ని బీజేపీ మతాల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరిస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య ఆరోపించారు. బుధవారం రామన్నపేటలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం రైతులు, కూలీలు, పేద ప్రజలు సాగించిన వీరోచిత ప్రజా పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటమని పేర్కొన్నారు.ఈ పోరాటంలో వేలాది మంది ప్రజలు, ముఖ్యంగా కమ్యూనిస్టు ఉద్యమ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని వీరయ్య తెలిపారు. సుమారు నాలుగు వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని, వారి త్యాగాలతో వెట్టి చాకిరీ, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం పెరిగిందన్నారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు అప్పట్లో ఎలాంటి పాత్ర లేకపోయినా, నేడు చరిత్రకు మతపరమైన రంగు పులుముతున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ ప్రయోజనాల కోసం అసలు చరిత్రను పక్కదారి పట్టిస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రజల వీరోచిత పోరాట వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వాస్తవ చరిత్రను యువతకు తెలియజేయాలని వీరయ్య పిలుపునిచ్చారు.సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముఖ్య పాత్ర సిపిఐదే

- సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి

**తొర్రూర్, తెలంగాణ చౌరస్తా:**

నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో వేలాది మందిని బలి ఇచ్చి పోరాటం సలిపిన ఘనత సిపిఐదే అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథి తెలిపారు. తొర్రూర్ మండలం వెంకటాపురంలోని మొగుళ్ల మల్లయ్య, హరిపిరాలలో వల్లపు కొమురెల్లి,తొర్రూరు పట్టణంలో మన్నూరు వెంకటయ్య, అమ్మపురంలో తమ్మెర వెంకట్ రామ్ నరసయ్య, పబ్బొస్ వీరభద్రయ్య, గూడేల్లి ఎల్లయ్య,జలగం సోమయ్య, తంగిరాల ప్రసాదరావు, గాదరబోయిన కొమురయ్య, బొల్లం వెంకయ్య,పంజాల రామస్వామి,కొత్తూరు నరసయ్య,డొంక రాములు మూడు రాంరెడ్డి,గుంటుక ఐలయ్య,కొలిపాక సోమన్న వారి స్తూపాలకు పూలమాల వేసి,వారి యొక్క కుటుంబాలను సన్మానించుకోవడం జరిగింది. అనంతరం బి విజయసారథి మాట్లాడుతూ.. 4000 మందిని బలి ఇచ్చి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన నిజమైన వారసులు సిపిఐ శ్రేణులే అన్నారు తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశంలో చేర్చాలని డిమాండ్ చేశారు.బిజెపి తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందువుల ముస్లింల గొడవలెక్క సృష్టిస్తుందన్నారు తెలంగాణ సాయుధ పోరాటానికి బిజెపికి సంబంధం లేదు అన్నారు ఈ తొర్రూరు ప్రాంతంలో వందలాదిమంది ఉద్యమంలో పాల్గొని మరణించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓమా బిక్షపతి, సిపిఐ తొర్రూర్ మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శిలు గణపురం లక్ష్మణ్,పేరబోయిన కిరణ్ కుమార్ శాఖ కార్యదర్శి బూరుగు యాదగిరి, వల్లపు వెంకన్న,పట్టణ కార్యదర్శి ముద్దరబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# అనుమతుల్లేని శ్రీధృతి స్కూల్‌పై చర్యలేవి..?

- అధికారుల నిర్లక్ష్యంపై ఆర్ జె డికి ఫిర్యాదు చేసిన బీసీ చైతన్య వేదిక
- ఒత్తిళ్లకు తలొగ్గిన ఎంఈఓ,డీఈఓ
- నగేష్ సూర్యవంశం ఆగ్రహం










**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:** మండల పరిధిలోని సాహెబ్ నగర్ కలాన్, భవానీ ఎన్‌క్లేవ్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న శ్రీధృతి ప్రైవేటు పాఠశాలను తక్షణమే మూసివేయాలని బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ సూర్యవంశం డిమాండ్ చేశారు.బుధవారం హైదరాబాద్‌లోని ఆర్‌జేడీ కార్యాలయంలో పాఠశాల ప్రాంతీయ సమగ్ర సంక్షేమాధికారి సోమిరెడ్డిని కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ సూర్యవంశం మాట్లాడుతూ..కనీస మౌలిక సదుపాయాలు, నిబంధనల ప్రకారం అనుమతులు లేవు అని తెలిసినా అధికారులు శ్రీధృతి స్కూల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

**ఉత్తర్వులు ఇచ్చినా స్పందన సున్నా:**
గత జూలై 8న సంబంధిత అధికారులు ఈ పాఠశాలను సీజ్ చేసినప్పటికీ స్కూల్ యాజమాన్యం నిబంధనలను బేఖాతరు చేస్తూ మరుసటి రోజే తిరిగి ప్రారంభించిందని తెలిపారు.దీనిపై డీఈఓ, కలెక్టర్లను కలసి ఫిర్యాదు చేయగా, పాఠశాలపై చట్టపరమైన కేసులు నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని హయత్ నగర్ ఎంఈఓను ఆదేశిస్తూ ప్రొసీడింగ్స్ ఆర్.సి నం.1238/బి2/2026 విడుదల చేశారన్నారు. ఉత్తర్వులు వచ్చి ఇన్ని రోజులవుతున్నా క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యమని మండిపడ్డారు. రాజకీయ ఒత్తిళ్లు, పైఅధికారుల సహకారంతో హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాసులు,రంగారెడ్డి డీఈఓ వెంకటేశ్వర్లు ఈ విషయాన్ని పట్టించుకోకుండా చేతులెత్తేశారని విమర్శించారు.అనుమతి లేని ఈ స్కూలులో విద్యార్థులకు ఏమైనా అవాంఛనీయ సంఘటన జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.విద్యార్థుల భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను నాశనం చేస్తున్న ఇటువంటి తగిన అనుమతులు లేని పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని.. ఈ అంశంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


PROCEEDINGS OFFICE OF THE DISTRICT EDUCATIONAL OFFICER, RANGA REDDY DISTRICT
Present Sri. S. Venkateswarlu, M.A. B.Ed.,

Rc.No.1238/B2/2026 Date: .09.2026

Sub:- School Education – Rangareddy District – Sri Dhruti School, Bhavani Enclave, Saheb Nagar Kalan, Hayathnagar Mandal – Running/continuing the school without valid permission / recognition and required statutory NOCs – Student safety and protection – Request to register a Police Case against the School Management – Reg.

Ref: Prajavani complaint submitted by B.C. Chaitanya Vedika Student Wing, dated 07.09.2026.

<>

It is hereby informed that, a complaint has been received against Sri Dhruti School, Bhavani [...]lave, Saheb Nagar Kalan, Hayathnagar Mandal, Rangareddy Dist for functioning without requisite [...]nission / recognition and statutory clearances. With regard to this earlier it was seized on 08.07.2026 by Mandal Educational Officer, Hayathnagar mandal, but without caring the action of the authorities school [...]agement has broke seal and continued the school functioning ,

Therefore, the Mandal Educational Officer Hayathnagar is once again instructed to close down the said [...]ol immediately in consultation with Police department, even though if the school management disobeys [...]rders file a criminal case against the school management and report compliance to this office.

**This matter may kindly be treated as MOST URGENT, keeping in view the safety and lives of [...]tudents.**

[...]As Above

District Educational Officer
Rangareddy District

[...]andal Educational Officer Hayathnagar mandal, Rangareddy Dist
[...] to the management of Sri Dhruti School, Bhavani Enclave, Saheb Nagar Kalan, Hayathnagar Mandal, [...]areddy Dist with an instruction to immediately close down the school.

---

## నాగోల్ డివిజన్‌లో 22A సమస్య
# పరిష్కారానికి సీఎం హామీ

- ముఖ్యమంత్రికి,మధు యాష్కీ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు
- కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మంజులా రెడ్డి



**ఎల్ బి నగర్,తెలంగాణ చౌరస్తా:** నాగోల్ డివిజన్ పరిధిలో దశాబ్దాలుగా వేలాది కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారానికి శాసనసభ వేదికగా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించడంపట్ల స్థానిక ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు మంజులా రెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ, హుడా అనుమతులు పొందిన లేఅవుట్లలో ఉన్న 22A సమస్యలపై శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రాత్మక ప్రకటన చేశారని తెలిపారు.గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అనుమతులు ఉన్న లేఅవుట్లలో సైతం నిషేధిత జాబితా పేరుతో సామాన్య, మధ్యతరగతి ప్రజల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.త్వరలోనే పక్కా కార్యాచరణ ప్రణాళికతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి సమగ్ర విధివిధానాలు ప్రకటిస్తామని సీఎం హామీ ఇవ్వడంపై నాగోల్ డివిజన్ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే దశాబ్దాలుగా నాగోల్ ప్రజలు ఎదుర్కొంటున్న ఈ రిజిస్ట్రేషన్ల వేదనను ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి వద్దకు నిరంతరం తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి విశేష కృషి చేసిన అఖిల భారత ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మధు యాష్కీ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం వీలైనంత త్వరగా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసి, నాగోల్ డివిజన్‌లోని వేలాది కుటుంబాలకు రిజిస్ట్రేషన్ల వెసులుబాటు కల్పించాలని ఈ సందర్భంగా మంజులా రెడ్డి విజ్ఞప్తి చేశారు.

---



# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

- వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలి
- డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడిపల్లి,తెలంగాణ చౌరస్తా:** మల్కాజ్గిరి కార్పొరేషన్ మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయి కమిటీలను మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ బుధవారం ప్రకటించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి శ్రీరాములు గౌడ్, తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని అన్నారు.నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లకు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, డీసీసీ జనరల్ సెక్రటరీ ఏనుగు జలంధర్ రెడ్డి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, గ్రంథాలయ మాజీ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, సీనియర్ ప్రభాకర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# లయన్స్ క్లబ్ భీమారం, ఆబోప ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:** ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు 112 వ జయంతి సందర్భంగా ఆల్ బ్రాహ్మిణ్ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆబోప) లయన్స్ క్లబ్ ఆఫ్ భీమారం సంయుక్త ఆధ్వర్యంలో భీమారం నందలి శివాని డిగ్రీ కళాశాల నందు రక్తదాన శిబిరం ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని లయన్స్ జిల్ల గవర్నర్ లయన్ నరహరి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ లయన్ సుధాకర్ రెడ్డి,పూర్వ జిల్లా గవర్నర్ లయన్ పొట్లపల్లి శ్రీనివాసరావుఆర్.సి తాడూరి రేణుక ఆబోప అధ్యక్షులు లయన్ మోత్కూరు మనోహర్ రావు, భీమారం క్లబ్ అధ్యక్షులు లయన్ దుగ్యాల ప్రసాద రావు,కార్యదర్శి లయన్ నాగుర్ల బాబురావు,శివాని కళాశాల విద్యా సంస్థల చైర్మన్ లయన్ టి.స్వామి గౌడ్ డైరక్టర్లు డా"వి.సురేశ్,జి.సురేందర్ రెడ్డి,ఎ.మురళీధర్,వి.చంద్రమోహన్ ఎస్ సంతోష్ రెడ్డి పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.జిల్లా గవర్నర్ లయన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ....ప్రజా కవి కాళోజీ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవకు భావితరం ఒక అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పూర్వ జిల్లా గవర్నర్ లయన్ పొట్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ....కాళోజీ తెలంగాణ తొలి మలి ఉద్యమాలలో తన రచనలైన నా గొడవ ద్వారా ప్రజల్లో ఎంతో చైతన్నాన్ని కలుగజేశారని ,పుటుక నీది చావు నీది బ్రతుకంత దేశానిది అన్న కాళోజీ వాక్యాలు దేశభక్తిని సమాజ సేవలో నేటి యువత బాధ్యతను ఎంతగానో తెలియజేస్తుందని నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకొని సమాజసేవలో పాలుపంచుకోవాలని అభిలషించారు. కళాశాల చైర్మన్ స్వామి మాట్లాడుతూ....విద్యార్థులలో విజ్ఞాన సముపార్జన తో పాటుగా సామాజిక చింతన,ఇతరులకు ఎంతో కొంత చేయాలనే తపనతో ఆచరణాత్మక ప్రేరణకు ప్రజా కవి లాంటి పెద్దలను స్మరించుకోవడం,సేవా కార్యక్రమాల్లో నిమగ్నం కావాలన్నారు.తదుపరి నిర్వహించిన రక్తదాన శిబిరంలో కళాశాల డైరక్టర్లు సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని 52 యునిట్ల రక్త దానం చేశారు.ఈ శిబిరంలో రెడ్ క్రాస్ సొసైటీ వైద్యులు డా.మదన్ మోహన్ ఆెటివేటర్ శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొనగా,ఉచిత ఆరోగ్య పరీక్షాన శిబిరంలో ప్రముఖ మధుమేహవ్యాధి నిపుణులు డా"టీ.నమిలికొండ పాంచాలరాయ్ డా"వేముగంటి సుశాంత్ దాదాపు వందమందికి పైగ పేషంట్లకు ఇ సి జి,బ్లడ్ షుగర్,బి.పి,ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించారు. మమమఈటూరి అనంతగోపాలకృష్ణ ఉచితంగ మందులు పంపిణి చేశారు. ఇంకా ఈ శిబిరంలో క్లబ్ బాధ్యులు లయన్ టి.అశోక్ మోత్కూరు, వెంకట్ ఆబోప బాధ్యులు ముసిపట్ల శ్రీనివాసరావు, చిట్టంపల్లి రవీందర్ రావు,దేవులపల్లి సుదర్శన్ రావు పెండెం శ్రీనివాసరావువనం శేషు తదితరులు పాల్గొన్నారు.ఆబోప అధ్యక్షులు మనోహర్ రావు శిబిరాన్ని నిర్వహించుటకు వేదికను కల్పించిన శివాని కళాశాల యాజమాన్యానికి సిబ్బందికి రక్తదానం చేసిన విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు.

---



## ఎస్ జి ఎఫ్ జిల్లాస్థాయి వాలీబాల్
# పోటీలకు ఆకునూరు విద్యార్థులు

**సైదాపూర్ తెలంగాణ చౌరస్తా:** మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 7 నుండి 9 వరకు జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 16 నుండి 19 వరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొట్ల రామస్వామి తెలిపారు జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామస్వామి మాట్లాడుతూ వాలీబాల్ సీనియర్ బాలికల విభాగంలో ఏడుగురు జూనియర్ విభాగంలో నలుగురు వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో ముగ్గురు జూనియర్ విభాగంలో ముగ్గురు మొత్తం 17 మంది విద్యార్థులు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. అలాగే ఖో ఖో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యా రని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు బొట్ల రామస్వామి పిడి నిర్మల ఉపాధ్యాయులు హన్మండ్ల భాస్కర్ సమ్మయ్య సుధాకర్ హరియా నాయక్ చిరంజీవి అనిత తదితరులు పాల్గొన్నారు. వాలీబాల్ బాలికల సీనియర్ విభాగంలో ఎర్రల రక్షిత నెల్లి ప్రణతి నెల్లి శ్వేత కాటిక సిరి బొడిగే రక్షిత గుర్రం అర్చన రాయిశెట్టి అవంతి లు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వాలీబాల్ బాలికల జూనియర్ విభాగంలో శిరవేణి సంకీర్తన మ్యాదరి హాసిని ఎండి అప్సాన బత్తుల కృపారాణి ఎంపికయ్యారు. వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో పెండోట సూర్యతేజ సోతుకు సాయి ఆశిష్ గుర్రం ప్రణీత్ జూనియర్ విభాగంలో జేల్లా శివ బొజ్జ నిశాంత్ పెండొట వరుణ్ తేజా లు ఎంపికయ్యారు.ఖో ఖో లో నెల్లి అను బత్తుల అనుశ్రీ గొట్టే నిత్య గుర్రం ఆరాధ్య లు ఎన్నికయ్యారు.

---

## అసభ్యకరంగా ప్రవర్తించిన
# వ్యక్తికి జైలు శిక్ష,జరిమానా

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** కాల్వ శ్రీరాంపూర్ మండలానికి చెందిన బాధితురాలతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నేరస్తునికి పెద్దపల్లి జిల్లా కోర్టు 1 సంవత్సరం జైలు శిక్ష రూ.3,000 జరిమానా విధించారు.కేసు వివరాలలోకి వెళ్తే....కాల్వ శ్రీరాంపూర్ మండలానికి చెందిన బాధితురాలు తేదీ 06/09/2025 సంవత్సరంలో ఇంట్లో బాధితురాలు ఒకటే ఉండగా జగ్గయ్య పల్లి గ్రామానికి చెందిన లోనే రాజు అనే నిందితుడు బాధితురాలు ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి బాధితురాలు చేయి పట్టుకొని ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు.ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించినాడు అప్పుడే బాధితురాలు కేకలు వేయగా ముద్దాయి లోనే రాజు అక్కడి నుంచి పారిపోయాడు అని బాధితురాలు తన భర్త ఇంటికి వచ్చాక జరిగిన విషయం తెలుపగా ఇట్టి విషయం గురించి కాల్వ శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి బాధితురాలు తనతో అసభ్యకరంగా ప్రవర్తించిన లోన రాజు పై ఫిర్యాదు చేయగా అప్పటి కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై ఎస్. వెంకటేష్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి నేరస్థుడిని జైలుకు పంపినారు అనంతరం పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.ఈ కేసును జిల్లా కోర్టు పెద్దపల్లి విచారణ చేశారు. న్యాయమూర్తి కె.సునీత ఇరుపక్షాల వాదనలు విని ,నేరస్తుడు లోనే రాజు నేరం చేసినట్లు రుజువుకావడంతో అతనికి 1 సంవత్సర కాలం జైలు శిక్షతో పాటు రూ.3,000 జరిమానా విధించారు.ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ దొంకెన రవీందర్ సాక్షులను ప్రవేశపెట్టి, సమర్థవంతంగా వాదనలు వినిపించారు.

**నేరస్తునికి శిక్ష పడడంలో కీలక పాత్ర పోషించిన అధికారులు**
పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి , ఏసీపీ జి.కృష్ణ పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో సహకరించిన పొన్నమనేని రంజిత్ రావు,సిఐ సుల్తానాబాద్,ఎస్ఐ గట్ల సుధాకర్,కాల్వ శ్రీరాంపూర్,కోర్ట్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్,హెచ్‌సీ204 లైసన్ ఆఫీసర్ పి.కోటేశ్వరరావు, హెచ్‌సీ2465,లను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

---



## నారాయణపురంలో బీఆర్ఎస్
# నేతల చురుకైన భాగస్వామ్యం

- శ్రీ వరసిద్ధి వినాయక అన్నదానంలో భాగస్వామ్యమైన బీఆర్ఎస్ నాయకులు
- అనారోగ్య బాధితులను పరామర్శించి భరోసా కల్పించిన నేతలు

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:** అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. బీఆర్ఎస్ మండల నాయకులు కాసాని నాగశేషా పద్మచంద్రమోహన్, కౌన్సిలర్ డా. ఉదయజ్యోతిడా. ప్రసాద్, గుడవర్తి వెంకటేశ్వరరావు, సత్యవరపు సంపూర్ణ తదితరులు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నారాయణపురం కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరైన నాయకులకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు.తదనంతరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మిండా పెద్ద దుర్గారావు అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కాటూరి రజనిని పరామర్శించి ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోటూరి మోహన్, ఆరెపల్లి గోవిందం, పాలవలస జీవన్, కౌలూరి నరేష్, కాటూరి నాగు, జక్కుల సందీప్, గుర్రాల భరత్, చందా సురేష్, మంగరాజు, శ్రీనివాస్, నారాయణపురం సొసైటీ అధ్యక్షులు నిర్మల పుల్లారావు, జక్కుల రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు గేనాల శివ, దేవరశెట్టి కిషోర్, బాలిన భాస్కరరావు, బండి రాము, లక్ష్మణ్, చితిని పణిబాబు, కాసినశెట్టి సత్తిబాబు, పల్లెల వెంకన్న బాబు, రాయగిరి ప్రసాద్‌తో పాటు గ్రామస్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---



# సర్ ఓటర్ సవరణలో లీగల్ నోటీసులు

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో సర్ ఓటర్ సవరణ లో భాగంగా ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ డ్రాఫ్టర్లో సవరణ నిమిత్తం గ్రామం లో గల ఓటర్లకు సంబంధించిన లీగల్ నోటీసులు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలవేన రమ రమేష్,జీపీఓ రాజు,వార్డ్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

---



# నిమజ్జనానికి డీజేలకు నో పర్మిషన్

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ఎస్సై గట్ల సుధాకర్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** కాల్వ శ్రీరాంపూర్ మండలంలో వినాయక చవితి ఉత్సవాలు,నిమజ్జనం సందర్భంగా డీజేలు ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతి లేదని ఎస్సై గట్ల సుధాకర్ స్పష్టం చేశారు.డీజే యజమానులు నిబంధనలు పాటించేలా సూచనలు చేసినట్లు తెలిపారు. డీజేల అధిక శబ్దంతో ప్రజలకు,వృద్ధులకు, చిన్నారులకు ఇబ్బందులు కలగడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు ఏర్పాటు చేసిన నిర్వాహకులు,ఆపరేటర్లపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై గట్ల సుధాకర్ హెచ్చరించారు.

# ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలకు శిక్షణ శిబిరం

- ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మండల విద్యాధికారి సిరిమల్ల మహేష్



**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్లో ఈ నెల 18న అవసరాలు కలిగిన బాలలు/విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి సిరిమల్ల మహేష్ తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల విద్యా,నైపుణ్యాభివృద్ధికి ఉపయోగపడే ఈ శిబిరాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ దివ్యాంగత్వ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగత్వం స్పష్టంగా కనిపించేలా పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.దివ్యాంగత్వ ధ్రువీకరణ పత్రం లేని విద్యార్థులు ప్రభుత్వ వైద్యుడు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం లేదా సంబంధిత మండల విద్యాధికారి జారీ చేసిన ధ్రువీకరణను తీసుకురావాలని తెలిపారు.ఆదాయ ధ్రువీకరణ పత్రం,రేషన్ కార్డు తదితర అవసరమైన పత్రాలతో శిబిరానికి హాజరుకావాలని సూచించారు.ప్రత్యేక అవసరాలున్న ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాలు, అవసరమైన శిక్షణ,నైపుణ్యాభివృద్ధి అందించడమే శిబిరం లక్ష్యమని మండల విద్యాధికారి పేర్కొన్నారు.తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని గుర్తించి తమ పిల్లలను శిబిరానికి తీసుకురావాలని కోరారు.



# వెంకటేశ్వర్ల పల్లెలో ఉచిత వైద్య శిబిరం

**జమ్మికుంట, తెలంగాణ చౌరస్తా:** జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వర్ల పల్లె గ్రామంలో జమ్మికుంట లోగల ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్,అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ మహిపాల్ (జనరల్ సర్జన్), డాక్టర్ భరత్ (న్యూరాలజిస్ట్), డాక్టర్ గ్రీష్మ (గైనకాలజిస్ట్) పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.రోగులకు ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు,వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆదిత్య,అమృత హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లోని పేద,నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాబోయే రోజుల్లో మరిన్ని గ్రామాల్లో ఇటువంటి వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహించి,అవసరమైన వైద్య సేవలను ప్రజలకు చేరువ చేస్తామని పేర్కొన్నారు.వైద్య శిబిరానికి అవకాశం కల్పించి సహకరించిన గ్రామ సర్పంచ్ పోల్సాని వినోదనారాయణరావు,ఉప సర్పంచ్ రేబెల్లి వెంకటేష్, పాలకవర్గ సభ్యులు,గ్రామ పెద్దలకు హాస్పిటల్ యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజధానిలో రౌడీల బెడద

**తరువాయి భాగం**

నా నడిరోడ్లపై వెంటాడి హతమారుస్తున్నారు. ఈ తరహా భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాకు చెందిన రౌడీషీటర్‌ను సోమవారం నాగోల్‌లో దారుణంగా అంతమొందించిన ఘటన మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఓ సెటిల్‌మెంట్‌లో తేడా రావడంతో ఇద్దరు రౌడీషీటర్ల మధ్య వివాదం చెలరేగింది. మూడు నెలలుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వారి పాత కక్షలు వినాయక చవితి పండగ రోజే భగ్గుమన్నాయి. ఇటీవల మీర్‌పేటలో రౌడీ షీటర్ సూరి హత్య మరవకముందే ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వెంటాడి హతమారుస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

రౌడీషీటర్లు, పాత నేరస్థులు కొత్తగా నేరాలు చేయకుండా నగర వ్యాప్తంగా నాలుగు కమిషనరేట్లలో నిఘా కొనసాగుతున్నాయి. అయినప్పటికీ కింది స్థాయి సిబ్బందిలో కొంతమంది నిర్లక్ష్యం కారణంగా నేరగాళ్లు హద్దులు దాటుతున్నారు. రౌడీ షీటర్లపై నగర పోలీసులు స్పెషల్ బ్రాంచ్, ఎస్‌వోటీ / టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీస్ స్టేషన్ల సిబ్బంది సమన్వయంతో నిఘా పెడుతుంటారు. అయినా వారి ఆగడాలు తగ్గడం లేదు.

ఈ క్రమంలో నేరస్థులను వివిధ రకాలుగా వర్గీకరించారు. పోలీసుల హెచ్చరికల్ని బేఖాతర్ చేస్తూ తరచూ నేరాలకు పాల్పడేవారు, అప్పుడప్పుడూ చేసేవారు, కొన్నేళ్ల క్రితం రికార్డులకెక్కి ఆ తర్వాత సత్ప్రవర్తనతో ఉండేవారిగా వర్గీకరించారు. తరచూ నేరాలు చేసే రౌడీల ఇళ్లను వారం లేదా అంతకంటే తక్కువ సమయంలో ఎప్పటికప్పుడు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తారు. దీనితో పాటు వారి కదలికలపై నిఘా పెడతారు.

**72 మంది రౌడీషీటర్లపై కేసులు నమోదు**

నేరాలు చేస్తే పాత కేసుల్లో బెయిళ్లు రద్దు చేయించేందుకు సిఫారసు చేస్తున్నారు. పాత కక్షలు, భేదాభిప్రాయాలతో గ్యాంగ్ వార్లకు అవకాశముంటే నిఘా సమాచారంతో కట్టడి చేస్తున్నారు. హైదరాబాద్ పోలీసులు ఈ ఏడాది జులై వరకూ 72 మంది రౌడీ షీటర్లపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఏడుగురిపై పీడీ యాక్టు నమోదు చేశారు. 828 మందిని బైండోవర్ చేసి 66 మంది బెయిళ్ల రద్దుకు సిఫారసు చేశారు.

# భద్రాద్రి కీ బదిలీ గ్రహణం... వీడేది ఎన్నడో...?

## గ్రామపంచాయతీల నుంచి జిల్లా శాఖల వరకు ఒకే చోట తిష్టవేసిన అధికారులు

- కదలని సీట్లు.. ఊపిరాడని అభివృద్ధి అంధకారంలో భద్రాద్రి జిల్లా!
- రాజకీయ అండదండలా? సొంత ప్రయోజనాల అభయహస్తమా?
- నిమ్మకు నీరెత్తిన యంత్రాంగం.. ఫైళ్లు ముందుకు కదలక ప్రజల అవస్థలు!
- ప్రజాసమస్యలు పక్కకెళ్లాయి.. వ్యవస్థలో చురుకుదనం చచ్చిపోయింది!
- కదలని సీట్లలో కుంభకోణాలు.. జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యం!
- ఉన్నతాధికారులు కళ్ళు తెరవాలి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి!
- ఐఏఎస్ మార్క్ ప్రక్షాళన ఏది?.. క్షేత్రస్థాయి పరిశీలన తక్షణ అవసరం!
- కలెక్టర్ గారూ స్పందించండి.. తక్షణమే సమూల ప్రక్షాళన చేపట్టండి!


11/09/2026 | Page No: 4
epaper.telanganachowrasta.com
భద్రాద్రి జిల్లాకే బదిలీ గ్రహణం..!

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పాలనా యంత్రాంగం దారితప్పి, నిద్రావస్థలోకి జారుకుంది. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల కార్యాలయాల నుంచి మొదలుకొని, మండల, గ్రామ స్థాయి సీట్ల వరకు అధికారులు ఏళ్ల తరబడి ఒకే చోట పాతుకుపోవడమే దీనికి ప్రధాన కారణం. రెండేళ్లు దాటితే బదిలీలు జరగాలనే నిబంధనలు ఉన్నప్పటికీ, భద్రాద్రి జిల్లాలో మాత్రం ఆ నిబంధనలు అటకెక్కాయి. ఏళ్ల తరబడి ఒకే కుర్చీకి పరిమితమైన ఉద్యోగుల తీరు వల్ల గ్రామాల్లో, మండలాల్లో కనీస అభివృద్ధి కరువై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ 'కుర్చీల మొండితనం' వెనుక గల అసలు మర్మమేమిటో, పాలన పడకేయడానికి కారణమవుతున్న ఆరు కీలక శాఖల పరిస్థితిపై ప్రత్యేక విశ్లేషణ.

**గ్రామపంచాయతీ కార్యదర్శులు కదలని కుర్చీలు.. కరువైన పారిశుధ్యం!**

గ్రామీణ ప్రాంతాలకు వెన్నుముక వంటి పంచాయతీ రాజ్ వ్యవస్థలో కార్యదర్శుల వైఖరి అస్తవ్యస్తంగా మారింది. ఒకే పంచాయతీలో ఏళ్ల తరబడి స్థిరపడిపోవడంతో గ్రామ పాలనపై పట్టు సాధించి, బాధ్యతలను పక్కన పెట్టేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.గ్రామాల్లో కనీస మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీల పరిశుభ్రత పూర్తిగా పడకేసింది.స్థానిక రాజకీయ నాయకులతో జతకట్టి, విధులకు గైర్హాజరవుతూ సొంత వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో తలదూరుస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.బదిలీల భయం లేకపోవడంతో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను, సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

**రెవెన్యూ శాఖ ఏళ్ల తరబడి ఒకే చోట.. భూ వివాదాల మాయాజాలం!**

జిల్లాలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో 'స్థానచలనం లేని' పాలన ప్రజలకు శాపంగా మారింది. వీఆర్వో వ్యవస్థ రద్దయినా, వీఆర్ఏలు, గిర్దావర్లు (ఆర్ ఐ ), తహసీల్దార్ కార్యాలయాల్లోని సీనియర్ అసిస్టెంట్లు ఒకే మండలంలో లేదా ఒకే డివిజన్‌లో ఏళ్ల తరబడి పాతుకుపోయారు. స్థానిక భూములు, సర్వే నంబర్లపై పూర్తిగా పట్టు సాధించి, క్రమబద్ధీకరణలు, భూమి రికార్డుల సవరణల పేరుతో తీవ్ర అక్రమాలకు తెరలేపుతున్నారనే విమర్శలు ఉన్నాయి.సాధారణ రైతులకు, పేద ప్రజలకు పాస్ పుస్తకాలు, మ్యుటేషన్లు, కుల ఆదాయ ధృవీకరణ పత్రాలు అందక కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి పాతుకుపోవడం వల్ల పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు మామూళ్ల నెట్‌వర్క్ బలపడి, ప్రతి చిన్న పనికి ప్రతిఫలం ఆశించే స్థాయికి వ్యవస్థ దిగజారింది.

**విద్యాశాఖ కొలువు తీరిన ఉపాధ్యాయులు.. కుదేలవుతున్న సర్కారీ చదువులు!**

విద్యాశాఖలో డిప్యుటేషన్లు, బదిలీల రహిత విధానం వల్ల ప్రభుత్వ పాఠశాలలు రోజురోజుకూ ప్రాభవాన్ని కోల్పోతున్నాయి.మండల విద్యాధికారుల (ఎంఈఓ) పోస్టుల నుంచి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ల వరకు ఏళ్ల తరబడి ఒకే పాఠశాలలో లేదా మండలంలో కొనసాగుతున్నారు.ఒకే చోట ఉండటం వల్ల విధుల్లో అలసత్వం పెరిగి, బోధనా ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయి. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నాణ్యతను పట్టించుకునే వారు కరువయ్యారు.విద్యాశాఖ అధికారులు బదిలీల వైపు దృష్టి సారించకపోవడం వల్ల గ్రామాల్లోని పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందక వారి భవిష్యత్తు అంధకారంగా మారుతోంది.

**పోలీస్ వ్యవస్థ స్థానిక మతలబులు.. కరువైన ఫ్రెండ్లీ పోలీసింగ్!**

ప్రజల రక్షణార్థం ఉండే పోలీస్ శాఖలోనూ ఏళ్ల తరబడి ఒకే స్టేషన్‌లో లేదా ఒకే సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న సిబ్బంది వల్ల వ్యవస్థపై నమ్మకం సడలుతోంది.రైటర్లు,కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు సుదీర్ఘకాలం ఒకే స్టేషన్‌లో తిష్టవేసి ఉండటం వల్ల స్థానిక అసాంఘిక శక్తులు, బెల్ట్ షాపు నిర్వాహకులు, ఇసుక/బలవంతపు వసూళ్ల దారులతో సంబంధాలుఏర్పరచుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి.న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే సామాన్య ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ అందకపోగా, స్థానిక మతలబుల వల్ల బాధితులకే అన్యాయం జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.బదిలీలు జరగకపోవడం వల్ల ముందస్తు నేరాల నియంత్రణ, నిఘా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోంది.

**పంచాయతీ రాజ్ & గ్రామీణాభివృద్ధి (పి ఆర్ & ఆర్ డి )నిలిచిన అభివృద్ధి పనులు!**

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, భవనాలు, మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టాల్సిన ఇంజనీరింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల కుర్చీలు సైతం కదలడం లేదు.ఏఈలు, డిఈలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఏళ్ల తరబడి ఒకే సబ్‌డివిజన్‌లో ఉండటం వల్ల కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాణ్యతాప్రమాణాలనుగాలికొదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.నిధులు మంజూరైనా పనులు సకాలంలో పూర్తికాక, గ్రామాల్లో కనీస రహదారి సదుపాయాలు లేక ప్రజలు అల్లాడుతున్నారు.రికార్డుల్లో పనులు పూర్తయినట్లు చూపి బిల్లులు చేయడంలో ఈ సుదీర్ఘ అనుభవమే అధికారులకు ఆసరాగా మారుతోంది.

**జిల్లా స్థాయి శాఖలు & కలెక్టరేట్ సెక్షన్లు పైస్థాయి ఫైళ్ల నిమ్మకు నీరెత్తు!**

జిల్లా కేంద్రంలోని ప్రధాన శాఖలు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్లలో సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు ఏళ్ల తరబడి ఒకే టేబుల్‌కు పరిమితమయ్యారు.ప్రజల నుంచి వచ్చే గ్రీవెన్స్ (ప్రజావాణి) అర్జీలు, కీలకమైన విచారణ ఫైళ్లు నెలల తరబడి ముందుకు కదలకపోవడానికి ఈ ఉద్యోగుల అలసత్వమే కారణం.కింది స్థాయి అధికారులను నియంత్రించాల్సిన జిల్లా అధికారులు సైతం తమ స్థానాలు కాపాడుకోవడానికే పరిమితమవుతుండటంతో, జిల్లా వ్యాప్తంగా పాలన పడకేసింది.రాజకీయనాయకుల సిఫార్సులు, ముడుపుల అండతో బదిలీ కాకుండా చూసుకుంటూ పాలనా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు.

### కలెక్టర్ స్పందించాలి.. సమూల ప్రక్షాళన జరగాలి!

ఈ ఆరు కీలక వ్యవస్థల్లో ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన వారి వల్ల జిల్లా ప్రజలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. నూతన అధికారులు బదిలీపై వస్తేనే పాలనలో కొత్తదనం, చురుకుదనం, పారదర్శకత పెరుగుతాయి.ఇప్పటికైనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి, రెండు నుంచి మూడేళ్లు దాటి ఒకే చోట విధుల్లో కొనసాగుతున్న ఉద్యోగులు, అధికారుల పూర్తి జాబితాను తెప్పించుకోవాలి. కింది స్థాయి గ్రామపంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు తక్షణమే బదిలీల కసరత్తు చేపట్టి, సమూల ప్రక్షాళన చేయకపోతే జిల్లాలో పాలనా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలే ప్రమాదం ఉంది!




# తెలంగాణ విమోచనమా? విలీనమా? విద్రోహమా?

సెప్టెంబర్ 17...
ఒక తేదీ కాదు
తెలంగాణ చరిత్ర గుండెల్లో
చెరగని రక్తాక్షరం!

ఒక వైపు
నిజాం నిరంకుశ పాలన...
మరోవైపు
వెట్టి సంకెళ్లలో నలిగిన ప్రజలు...

భూమి కోసం....భుక్తి కోసం......
బతుకు కోసం.....ఆత్మగౌరవం కోసం...
ఎగిసిన తెలంగాణ పిడికిళ్లు!

దొడ్డి కొమురయ్య నుంచి
చాకలి ఐలమ్మ వరకు...
పేర్లు తెలిసినవారెందరో,
పేర్లు తెలియని అమరవీరులెందరో—
వారి రక్తంతోనే
తెలంగాణ చరిత్ర రాయబడింది!

*అది విద్రోహమా?*
అవును!
అన్యాయాన్ని ఎదిరించిన
ప్రజల తిరుగుబాటు!

*అది విమోచనమా?*
అవును!
నిజాం పాలనకు తెరపడి
హైదరాబాద్ సంస్థానం
భారత యూనియన్‌లో చేరిన రోజు!

*అది విలీనమా?*
అవును!
హైదరాబాద్ సంస్థానం
భారతదేశపు సమైక్య పటంలో
భాగమైన చారిత్రక ఘట్టం!

కానీ ప్రశ్న ఒక్కటే.....

సెప్టెంబర్ 17ను
ఎవరి రాజకీయ అద్దంలో చూడాలి?

విమోచనం అన్నవాడు
విలీనాన్ని మరిచిపోవాలా?

విలీనం అన్నవాడు
ప్రజల తిరుగుబాటును మరిచిపోవాలా?

ప్రజా పాలన అన్నవాడు
అమరవీరుల రక్తచరిత్రను
మరిచిపోవాలా?

పేర్ల కోసం పోరాడుతూ
చరిత్రను ముక్కలు చేయకండి!

ఎందుకంటే....
*విమోచనం ఒక కోణం...*
*విలీనం ఒక వాస్తవం...*
*విద్రోహం ఒక ప్రజా పోరాటం...*
*ప్రజా పాలన ఒక చారిత్రక*
*పరిణామం...*

కానీ వీటి మధ్యలో
నిజమైన కథానాయకుడు ఎవరు?

అధికారపు కుర్చీ కాదు...
రాజకీయ జెండా కాదు...
పార్టీ పేరు కాదు...

ప్రజలే!

వారి కన్నీళ్లు.....వారి తిరుగుబాటు......
వారి త్యాగం.......
వారి ఆత్మగౌరవం.......

అదే సెప్టెంబర్ 17 అసలు స్ఫూర్తి!

1948 సెప్టెంబర్ 17న
హైదరాబాద్ సంస్థానం భారత
యూనియన్‌లో చేరింది.
కానీ అది నేటి తెలంగాణ రాష్ట్ర అవతరణ
కాదు.
అప్పటి హైదరాబాద్ సంస్థానంలో
నేటి తెలంగాణతో పాటు
మరాఠ్వాడా, కర్ణాటక ప్రాంతాలూ
ఉన్నాయి.
అందుకే.....

చరిత్రను రాజకీయ నినాదంగా
మార్చొద్దు...
అమరవీరులను రాజకీయ ఆయుధాలుగా
మార్చొద్దు...
సెప్టెంబర్ 17ను ఓట్ల కోసం కాదు,
వాస్తవాల కోసం గుర్తు చేసుకుందాం!

నిజాం పాలన ముగిసింది...
హైదరాబాద్ భారతదేశంలో కలిసింది...
ప్రజాస్వామ్యానికి మార్గం తెరుచుకుంది...

కానీ చరిత్ర అడిగే ప్రశ్న మాత్రం ఇంకా
అదే....

"పేరు ఏదైనా పెట్టుకోండి...
కానీ ఈ నేల కోసం
రక్తం చిందించిన వారి త్యాగాన్ని
మరిచిపోకండి!"

*సెప్టెంబర్ 17*
*విమోచనమా? విలీనమా?*
*విద్రోహమా?***

చరిత్రను ఎవరి సొత్తుగా చేసుకోలేరు!
త్యాగాలను ఎవరి జెండాకింద
బంధించలేరు!
తెలంగాణ చరిత్ర
తెలంగాణ ప్రజలదే!

సెప్టెంబర్ 17ను
వివాద దినంగా కాదు—
వాస్తవాలను గుర్తుచేసుకునే
చారిత్రక దినంగా జరుపుకుందాం.

జై తెలంగాణ!
జై హింద్!
"విమోచనం–విలీనం–విద్రోహం"
మూడింటినీ ఒకదానికొకటి వ్యతిరేకంగా
కాకుండా, చరిత్రలోని వేర్వేరు
కోణాలు..... తెలంగాణ ప్రభుత్వం 2024
నుంచి సెప్టెంబర్ 17ను **"ప్రజా పాలన
దినోత్సవం"**గా అధికారికంగా
నిర్వహిస్తోంది......

అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం
"Hyderabad Liberation Day" అనే
పేరును ఉపయోగిస్తోంది.....



దేశిని శ్రీధర్ గౌడ్
ఎం.ఏ, ఎం.ఈడి
ప్రిన్సిపల్ ఎస్ అర్ జూనియర్ కళాశాల
9849818284